క్లుప్తంగా

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



పెడన: పట్టణంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. ఆదివారం 15వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, పుష్‌కార్ట్స్, డస్ట్‌బిన్లను పురపాలక సంఘంలో కాగిత కృష్ణప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా 15వ ఆర్థిక సంఘం నిధులతో పారిశుద్ధ్యం మెరుగుపరచడానికి ట్రాక్టర్లను కొనుగోలు చేశామన్నారు. కార్యక్రమంలో సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, అబ్దుల్ ఖయ్యూం, కోమట్ల అనిల్‌కుమార్, కమిషనర్ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు



అవనిగడ్డ: రాయల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ.4.60 లక్షల ఉపకార వేతనాలను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అందించారు. ఏ-1 మార్టు సమావేశ హాలులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో 62 మంది మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేశారు. బొండాడ ఇంజనీరింగ్ కంపెనీ సీఎండీ బొండాడ రాఘవేంద్రరావు సహకారంతో కార్యక్రమం చేపట్టారు. ఎంఈవోలు టీవీఎం రాందాస్, రాయల్ సర్వీస్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి తోట పద్మనాభరావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ తోట శ్రీరంగసత్య బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

70 మందికి దుప్పట్ల పంపిణీ



మచిలీపట్నంటౌన్: నగరంలోని 22వ డివిజన్ దేవునితోట యానాదుల కాలనీలో నివసిస్తున్న కుటుంబాల వారికి అవోపా మచిలీపట్నం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవోపా సంస్థ ప్రతినిధి, కృష్ణవేణి ఐటీఐ కళాశాల కరస్పాండెంట్ కొత్తగుండు రమేష్ మాట్లాడుతూ చలికాలంలో యానాదులు చలికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో 70 మందికి దుప్పట్లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో డాన్ బాస్కో నవజీవన్ సంస్థ ప్రతినిధి ఎస్.ఆశాజ్యోతి, అవోపా ప్రతినిధులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



మచిలీపట్నంటౌన్: పరాసుపేట ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో ముద్రించిన 2025 నూతన సంవత్సర దైవార్చన క్యాలెండర్‌ను ఫాదర్ ఎన్.డేవిడ్ రాజు ఆదివారం ఆవిష్కరించారు. పరాసుపేటలోని హోలి క్రాస్ చర్చిలో ఆదివారం జరిగిన దివ్య బలి పూజ అనంతరం ఆవిష్కరణ జరిగింది. మచిలీపట్నం విచారణ పరిధిలోని ప్రతి ఆర్సీఎం కుటుంబానికి ఈ క్యాలెండర్ అందజేస్తామని డేవిడ్‌రాజు తెలిపారు.

వస్త్రాలు, నిత్యావసరాలు అందజేత



చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి మండల పరిధిలోని పురిటిగడ్డ ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ ఆవరణలో వితంతువులు, వృద్ధులకు రూ.1.30 లక్షల విలువైన వస్త్రాలు, నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఆదివారం ఐవీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండల పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన 102 మంది వృద్ధులు, వితంతువులకు ఐవీఎం ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ నూతన వస్త్రాలు, సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వేములపల్లి రోజా, విజయ పాల్గొన్నారు.

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తుల తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

అక్కరకు రాని నీటి పథకం

- పట్టించుకోని పాలకులు
- పటాన్‌పేటలో రూ.19 లక్షలు వృథా

గూడూరు: ప్రజా సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించే ప్రతి పైసా ప్రజలకు చేరినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసినప్పుడే అది సాకారం అవుతుంది. గూడూరు శివారు పటాన్‌పేటలో రూ.19 లక్షల వ్యయ అంచనాతో నిర్మించిన రక్షిత నీటి పథకం దశ, దిశా లేక ప్రజలకు అక్కరకు రాకుండా పోయింది. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో రూ.లక్షలు ధారపోసి నిర్మించిన పథకం అలంకార ప్రాయంగా మారింది.

ఏడేళ్లుగా ఇదే పరిస్థితి..

గూడూరు శివారు పటాన్‌పేటకు రక్షిత నీరు అందించాలన్న లక్ష్యంతో 2016లో అప్పటి ఎమ్మెల్యే కాగిత వెంకట్రావు రూ.19లక్షలతో రక్షిత నీటి పథకాన్ని మంజూరు చేయించారు. శరవేగంగా నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న పథకాన్ని 2017లో కాగిత వెంకట్రావు ప్రారంభోత్సవం కూడా చేసేశారు. అయితే రక్షిత నీటి పథకాన్ని గ్రామంలోని పైప్‌లైన్‌కు అనుసంధానం చేయకపోవడంతో పథకం అక్కరకు రాకుండా పోయింది. శిలాఫలకాలపై పేర్ల కోసం తాపత్రయపడే నాయకులు పథకం గురించి పట్టించుకోకపోవడం కారణంగానే ఈ దుస్థితి వచ్చిందని ప్రజలు విమర్శిస్తున్నారు.



పటాన్‌పేటలో అలంకార ప్రాయంగా మారిన రక్షిత నీటి పథకం

అరకొరగానే సరఫరా

ప్రస్తుతం గూడూరులో ఉన్న రక్షిత నీటి పథకం ద్వారా పటాన్‌పేటకు కూడా నీరు సరఫరా అవుతుంది. కానీ పటాన్‌పేట ప్రాంతం కొంచెం ఎత్తులో ఉండటం, మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారి కింద నుంచి వెళ్లిన పైప్‌లైన్ పగిలి పోవడంతో పూర్తిస్థాయిలో ఈ ప్రాంత ప్రజలకు తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో ప్రజలు ఊరిబయట ఉన్న బావులు, బోరింగ్ పంపుల ద్వారా తాగునీరు తెచ్చుకుని గొంతు తడుపుకుంటున్నారు.

ఇప్పటికైనా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించి రక్షిత నీటి పథకాన్ని వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



పిచ్చిమొక్కలతో నిండి అడవిని తలపిస్తున్న మోటార్ పంప్‌సెట్ గది



రక్షిత నీటి పథకం నుంచి చుక్క నీరు రాని కుళాయి

వైభవంగా పైడమ్మ జాతర

- ఆలయ ప్రవేశం చేసిన అమ్మవారు
- ఊరేగింపుగా వచ్చిన శిడిబండ్లు

పెడన: పట్టణంలోని శ్రీపైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఊపందుకున్నాయి. ఆదివారం రెండో రోజు వేకువ జామున అమ్మవారు మచిలీపట్నం నుంచి ఊరేగింపుగా పెడనకు చేరుకోవడంతో అమ్మవారిని పైడమ్మ చెరువు వద్దకు తొడ్కొని వెళ్లి మెట్టినింటి వారు దాసు వంశీయులు నైవేద్యాలను సమర్పించారు. అక్కడ నుంచి ఘటం గుడి వద్ద పుట్టింటి వారు తోట వంశీయులు నైవేద్యాలను సమర్పించిన పిమ్మట తిరిగి కిష్టమ్మ బావి వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చి ఆలయానికి తీసుకువెళ్లారు. అమ్మవారు ఆలయ ప్రవేశం చేయడంతో భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. కాపుల వీధిలోని వారంతా పెద్ద ఎత్తున శిడి బండ్లను కట్టి భారీ ఊరేగింపుగా వాయిద్యా మేళతాళాలతోను, నృత్య ప్రదర్శనలతో, డప్పు కళాకారులతో, డీజే సిస్టమ్స్ ద్వారా యువత నృత్యాలు చేస్తూ మధ్యాహ్నం బయల్దేరారు. మార్గం మధ్యలో శిడిబండ్లకు ముత్తయిదువులు బిందెళ్లతో పసుపు నీరు కింద పోసి అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పించి కొబ్బరికాయలు కొట్టి హారతులిచ్చారు. శిడిబండ్ల ఊరేగింపు గుడివాడ రోడ్డులోని ముత్యాలమ్మ ఘటం గుడి వద్దకు చేరుకుంది. అక్కడ నుంచి పాత కూరగాయల మార్కెట్‌వద్ద పోతురాజు స్వామిని దర్శించుకున్న పిమ్మట బస్‌స్టాండ్ సెంటరుకు చేరుకుని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద కొబ్బరికాయలు కొట్టిన తర్వాత పైడమ్మ ఆలయానికి శిడిబండ్లు చేరుకున్నాయి. పిన్న, పెద్దా పసుపు, కుంకుమ జల్లుకుంటూ పైడమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో టీవీవీ మోహనరావు, ఉత్సవ కమిటీ వారు, దేవదాయ శాఖ సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేశారు.



కాపుల వీధిలో శిడిబండ్లు



విచిత్ర వేషధారణలతో నృత్యం



నృత్య ప్రదర్శనను ఆసక్తిగా చూస్తున్న భక్తులు

శ్రీరాములు త్యాగనిరతి స్ఫూర్తిదాయకం

అవనిగడ్డ: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగనిరతి స్ఫూర్తిదాయకమని అతిథులు చెప్పారు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలోని పొట్టి శ్రీరాములు, గాంధీజీ విగ్రహాలకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ మార్గంలో పొట్టి శ్రీరాములు సాగించిన జీవితం అందరికీ ఆదర్శనీయమని చెప్పారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయం వద్ద పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘం నేత గార్లపాటి గోపీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

మోపిదేవి: అమరజీవి పొట్టి శ్రీరాములు గొప్ప త్యాగశీలి అని కోసూరువారిపాలెం మాజీ ఉపసర్పంచ్, జనసేన నేత కోసూరు రామాంజనేయులు అన్నారు. మోపిదేవి ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద పొట్టి శ్రీరాములు, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విశ్రాంత ఉపాధ్యాయులు గద్దె రఘురామారావు, విస్సంశెట్టి ఆంజనేయులు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

కోనేరుసెంటర్: ఆంధ్ర రాష్ట్ర సాధనకు ఆమరణదీక్ష చేసి ప్రాణాలను వదిలిన అమరజీవి పొట్టి శ్రీరాములు పోరాట పటిమ స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ షేక్‌సిలార్‌దాదా అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని పార్టీ కార్యాలయంలో ఆదివారం శ్రీరాములు చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ బొర్రా విఠల్, మాజీ జెడ్పీటీసీ లంకే వెంకటేశ్వరరావు, గాజుల భగవాన్, వేముల కృష్ణ, వెచ్చా మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

- కానూరు సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ నివాళులు అర్పించారు.

ఘంటసాల: ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆత్మబలిదాన దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎన్ఆర్‌జీఎస్ సీవో బాలు, వెలుగు కార్యాలయం ఎకౌంటెండ్ జానకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యుత్ శాఖ కార్యాలయంలో లైన్‌మెన్ కొడాలి సామ్యూల్ ఆధ్వర్యంలో శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మట్టా హర్ష, కొండపల్లి పిచ్చేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బంటుమిల్లి: అమరజీవి పొట్టి శ్రీరాములు 78వ ఆత్మార్పణ దినోత్సవాన్ని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి సిబ్బందితో కలిసి అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ శివశంకర్, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాగాయలంక: మండల ఆర్యవైశ్యసంఘం, శ్రీవాసవీ సేవాదళ్ సంయుక్త ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాలు ఆదివారం నాగాయలంకలో నిర్వహించారు. స్థానిక ట్రాఫిక్ ఐలాండ్ కూడలిలో శ్రీరాములు చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక వాసవీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంగణంలో నిర్వహించిన వర్ధంతిలో ముఖ్యఅతిథి డాక్టర్ బాసు ప్రతాప్ మాట్లాడారు. గాంధీజీ విగ్రహానికి ఇరిగేషన్ ఏఈ పొన్నూరు రవితేజ పూల మాలలు వేసి నివాళులర్పించారు. కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు, తాడికొండ సత్యనారాయణ, దేసు సత్యనారాయణ, చిట్టా వీర అన్నపూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పెడన: అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసిన(వర్ధంతి) రోజును పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి తదితరులతో కలిసి అమరజీవి చిత్రపటానికి, పాత కూరగాయల మార్కెట్ వద్ద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, కౌన్సిలర్లు అబ్దుల్ ఖయ్యూం(బాబులాల్), వైఎస్సార్ సీపీ నాయకులు కోమట్ల అనిల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి ప్రార్థన మందిరంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు కొల్లూరి చిన్నా ఆధ్వర్యంలో సంఘ నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం వీరు కొంకేపూడిలోని ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సురేష్‌కుమార్, చంటి, గోపాల్, సునీల్, సతీష్, రాఘవరావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.
- పెడన బీజీకే జెడ్పీహెచ్‌ఎస్‌లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎంఈవో-2 వై హరినాథ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మచిలీపట్నంటౌన్: పొట్టి శ్రీరాములు వర్ధంతిని నగరంలో పలు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. స్థానిక ఐదురోడ్ల సెంటర్‌లోని శ్రీరాములు విగ్రహం వద్ద నేతాజీ మిత్ర మండలి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణవేణి ఐటీఐ కళాశాల కరస్పాండెంట్ కొత్తగుండు రమేష్, నేతాజీ మిత్రమండలి కో కన్వీనర్ ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, సూరిశెట్టి హరికృష్ణ, కొండా ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు .

- నగరంలోని పంపుల చెరువు వద్ద ఉన్న విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్ఈ) కార్యాలయం వద్ద పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. శ్రీరాములు చిత్రపటానికి ఎస్ఈ సత్యానందం, టెక్నికల్ ఈఈ సుధాకర్, డీఈఈ శ్రీనివాసరావు, ఏడీఈ రామకృష్ణ తదితర అధికారులు, కార్యాలయ సిబ్బంది పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.
- లేడీయాంప్తిల్ బాలికల జూనియర్ కళాశాలలో శ్రీరాములు చిత్రపటానికి జిల్లా ఇంటర్మీడియెట్ విద్యా శాఖాధికారి పీబీ సాల్మన్‌రాజు పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.సుందరలక్ష్మి, అధ్యాపకుడు నాగవేణు, ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు పాల్గొని నివాళులు అర్పించారు.



అవనిగడ్డ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు



శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న షేక్‌సిలార్‌దాదా, ఇతర నాయకులు



నాగాయలంక ట్రాఫిక్ కూడలిలో అమరజీవికి నివాళులర్పించిన ఆర్యవైశ్యసంఘం నాయకులు

పొట్టి శ్రీరాములుకు నివాళి

మచిలీపట్నంటౌన్: ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు తన జీవితాన్ని అర్పించిన మహనీయుడని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కొనియాడారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి ఆదివారం నగరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు సెంటర్‌లోని శ్రీరాములు కాంస్య విగ్రహానికి మంత్రి కొల్లు, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, ఇతర కూటమి నాయకులతో కలసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ మోటమర్రి బాబా ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, కూటమి నాయకులు బండి రామకృష్ణ, కొనకళ్ల బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి కొల్లు , ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల



నాగాయలంకలో శ్రీరాములు, గాంధీజీ విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



కొంకేపూడిలోని ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న దృశ్యం



పెడన బీజీకేజెడ్పీహెచ్‌ఎస్‌లో నివాళులర్పిస్తున్న ఎంఈవో-2 హరినాథ్ తదితరులు



ఐదు రోడ్ల సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

సందడిగా ఐక్య క్రిస్మస్

మచిలీపట్నంటౌన్: ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసీసీ), మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల పాస్టర్ల సమాఖ్య ఆధ్వర్యాన ఆదివారం రాత్రి స్థానిక కోనేరు సెంటర్లో నిర్వహించిన ఐక్య క్రిస్మస్ కార్యక్రమం సందడిగా జరిగింది. తొలుత స్థానిక జిల్లా కోర్టు సెంటర్ నుంచి కోనేరు సెంటర్ వరకు క్రైస్తవులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు జన్మించిన ఇతివృత్త ప్రదర్శనతో చిన్నారులు ముందుకు సాగారు. అంతర్జాతీయ దైవ వర్తమానికుడు డాక్టర్ జాన్ వెస్లీ వాక్యోపదేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన క్రిస్మస్ పర్వదినానికి సంబంధించిన ఇతివృత్తాన్ని వివరించారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, కూటమి నేతలు తెలుగు చర్చి వికార్ జాస్పర్, ఏఐసీసీ మచిలీపట్నం డివిజన్ అధ్యక్షుడు మేక విజయరాజు తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని నిర్వాహకుడు బెరాకా మినిస్ట్రీస్ చైర్మన్ బ్రదర్ బి ఎస్ కిరణ్ పాల్ పర్యవేక్షించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

వెంకటాపురం(మోపిదేవి): వెంకటాపురం గ్రామంలో సియోను గాస్పెల్ మినిస్ట్రీస్ ప్రార్థనా మందిరంలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం రాత్రి నిర్వహించారు. పాస్టర్ రాజేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజయవాడ వ్యాపారవేత్త నెలకుదుటి శంకరావు, నిర్మల దంపతులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సియోను గాస్పెల్ కమిటీ సభ్యులు అబ్బూరి విజయరాజు(నాగరాజు) ఆర్థిక సహకారంతో 200 మంది సేవకులకు బహుమతులు అందజేశారు.

అనంతరం నూతన సంవత్సరం 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. తొలుత చిన్నారులతో డత్యన్స్ ప్రోగ్రాంతో పాటు సేవకులు ఆటపాటలతో వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల పాస్టర్ల సంఘం అధ్యక్షుడు ఇస్మాయిల్, సీహెచ్ టీం-యూత్, పలువురు సంఘ సేవకులు పాల్గొన్నారు.



బందరులో జరిగిన ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు



వెంకటాపురంలో బహుమతులు అందజేస్తున్న శంకరరావు, నిర్మల



బందరులో ఏసుక్రీస్తు జననానికి సంబంధించిన ఇతివృత్తాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు

కర్రసాము పోటీల్లో విద్యార్థులకు పతకాలు

అవనిగడ్డ: జాతీయస్థాయి ప్రాచీన కర్రసాము పోటీల్లో ఈశ్వర్ అకాడమీకి చెందిన విద్యార్థులు 42 బంగారు పతకాలు సాధించినట్లు అకాడమీ నిర్వాహకులు ఈశ్వర్ తెలిపారు. నెల్లూరులో 13, 14 తేదీల్లో జరిగిన పోటీల్లో అకాడమీకి చెందిన 22 మంది విద్యార్థులు పాల్గొనగా పలు విభాగాల్లో 42 బంగారు పతకాలు, 9 కాంస్యం, ఐదు రజత పతకాలు సాధించినట్లు చెప్పారు. ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మండలి బుద్ధప్రసాద్ విజేతలను అభినందించారు.

మావోయిస్ట్ పృథ్వీ మోహన్ స్వస్థలం ఐదుగుళ్లపల్లి

గూడూరు(పెడన): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణ్‌పూర్ జిల్లాలో ఈ నెల 12న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్ట్ రామచంద్ర(65) స్వస్థలం మండలంలోని ఐదుగుళ్లపల్లి. రామచంద్ర అసలు పేరు పృథ్వీ మోహన్. అతని స్వస్థలం గూడూరు మండలం ఐదుగుళ్లపల్లి. అతనికి ముగ్గురు సోదరులు, ఇద్దరు సోదరీమణులు. మావోయిస్టుల్లో చేరిన తర్వాత తన పేరును రామచంద్ర, కార్తీక్, దస్రు, జీవన్, దాశరన్న, నరేష్, లఖ్మగా మార్చుకుంటూ మావోయిస్టు కార్యకలాపాల్లో పాల్గొని కీలకనేతగా ఎదిగాడు. గతంలో తనతో పాటుగా మావోయిస్టుగా పనిచేసిన పద్మను మోహన్ పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఒక ఆడపిల్ల పుట్టగా ఆమె ఐదేళ్ల వయస్సు వరకు ఐదుగుళ్లపల్లిలోని తన తాత, నానమ్మల వద్దే పెరిగింది. క్యాన్సర్ బారిన పడిన భార్య పద్మ పోలీసులకు లొంగి పోయి జన జీవన స్రవంతిలో కలిసింది. ప్రస్తుతం బెంగళూరులో తన కుమార్తెతో పాటు ఉంటూ చికిత్స పొందుతోంది. పాలిటెక్నిక్ విద్యాభ్యాసం కోసం నల్లపాడు వెళ్లాకే మోహన్‌లో విప్లవభావజాలం పెరిగిందని అతని తమ్ముడు యోగానందరావు పేర్కొన్నారు. ఏడాది క్రితం మోహన్ కుటుంబ సభ్యులందరినీ విచారణ చేసిన ఎన్ఐఏ అధికారులు వారి నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేసుకుని వెళ్లిపోయారు. పృథ్వీమోహన్ మరణంతో కుటుంబసభ్యులు, బంధువుల్లో విషాదచాయలు అలముకున్నాయి.